క్లుప్తంగా

రోగులకు పండ్ల పంపిణీ



తుని ఏరియా ఆసుపత్రిలో గర్భిణికి పండ్లు పంపిణీ చేస్తున్న విష్ణుచక్రం

తుని: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు దాడిశెట్టి నరసయ్య సేవాదళ్ ఆధ్వర్యంలో శుక్రవారం పండ్లు పంపిణీ చేశారు. ధనలక్ష్మి జ్యూయలర్స్, శ్రీవిద్యా విద్యాసంస్థల అధినేత దాడిశెట్టి విష్ణుచక్రం 200 మంది గర్భిణులు, వృద్ధులు, బాలింతలు, రోగులకు పండ్లు అందజేశారు. తన తండ్రి దాడిశెట్టి నరసయ్య జ్ఞాపకార్థం ప్రతి నెలా సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు విష్ణుచక్రం తెలిపారు. కార్యక్రమంలో చదరం శివాజీ, కుందెం సత్యనారాయణ, గాజుల వేణుగోపాలస్వామి, దోసిబట్ల సత్యనారాయణమూర్తి, పర్వత బాబూరావు, వాడపల్లి శ్రీను, పోలసానపల్లి పద్మ పాల్గొన్నారు.

ఘనంగా గీతా జయంతి



గోకవరంలో గీతా మందిరం వద్ద హోమం నిర్వహిస్తున్న భక్తులు

గోకవరం: స్థానిక వెలమపేటలోని గీతా మందిరంలో శుక్రవారం గీతా జయంతిని ఘనంగా నిర్వహించారు. సనాతన ధర్మప్రబోధనా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు తోట సాయి బాబు ఆధ్వర్యంలో చాతుర్మాస వ్రతం, ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం భగవద్గీత పారాయణ నిర్వహించారు. కార్యక్రమంలో గాజింగం చంద్రాయమ్మ, మేడా వసుంధర, గండి వాణి, గంంటా రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

హిందూధర్మ పరిరక్షణ అందరి బాధ్యత

గోకవరం: హిందూ మతం ఒక జీవన విధానమని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, సీఎండీకేఎస్పీ సంస్థ అధినేత కంబాల శ్రీనివాస్‌రావు అన్నారు. మండలంలోని కృష్ణునిపాలెం పంచాయతీ ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో శుక్రవారం హిందూ ధర్మ పరిరక్షణపై ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మతమార్పిడులు కారణంగా హిందూ మతం ప్రమాదంలో పడిందన్నారు. హిందువులు సంఘటితమై హిందూధర్మాన్ని పరిరక్షించాలన్నారు. హిందూమత పరిరక్షణకు అవసరమైతే ఆర్థికంగా సహకారం అందించడానికి తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానన్నారు. పలు గ్రామాలకు చెందిన ప్రతినిధులు ఆయా గ్రామాల్లో దేవాలయాల పరిస్థితిని ఆయన దృష్టికి తీసుకురాగా తగిన సహాయం అందజేస్తామని హామీ ఇచ్చారు. తొలుత దేవీచౌక్ ఆలయం నుంచి ఆర్‌అండ్ ఆర్ కాలనీ వరకూ హిందువులు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వరసాల ప్రసాద్, తామర్ల రాంబాబు, ఇనకోటి బాపన్నదొర, వల్లూరి జగన్నాథశర్మ, ఉంగరాల ఆదివిష్ణు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ తనిఖీలు



ఒంటిమామిడి పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి

తొండంగి: మండలంలోని ఒంటిమామిడి పోలీస్‌స్టేషన్‌ను పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి శుక్రవారం తనిఖీ చేశారు. స్టేషన్‌లో పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పోలీసు సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కోవిడ్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై జి.వెంకటేశ్వరరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీర్లకు నియామక పత్రాలు అందజేత

కిర్లంపూడి: మండలంలోని భూపాలపట్నం, జగపతినగరం, సోమవరం, రాజుపాలెం గ్రామాలకు చెందిన నూతన వలంటీర్లకు ఎంపీపీ తోట రవి శుక్రవారం నియామక పత్రాలు అందజేశారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల దీక్ష

గోకవరం/ప్రత్తిపాడు: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ సిబ్బంది చేపట్టిన రిలే నిరాహార దీక్ష కొనసాగుతోంది. కాగా శుక్రవారం దీక్షా శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సందర్శించి మద్దతు తెలిపారు. అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఆయన వెంట పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు. ప్రత్తిపాడులో అంగన్‌వాడీలు నిరసన ర్యాలీ నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు జంక్షన్ వరకూ చేరుకుని రాస్తారోకో చేశారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.

ఉత్తరద్వార దర్శనానికి వేళాయె

- నేడు వైకుంఠ ఏకాదశి
- తెరుచుకోనున్న 'వైకుంఠ' ద్వారాలు
- వైష్ణవాలయాల్లో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు పూర్తి



విద్యుత్ కాంతుల నడుమ ఎస్.అన్నవరంలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం



ఉత్తర ద్వార దర్శనాలకు సిద్ధం చేసిన క్యూలైన్లు

తుని రూరల్: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని శనివారం వైష్ణవాలయాల్లో స్వామివారి దర్శనాలకు ఉత్తర (వైకుంఠ) ద్వారాలు తెరుచుకోనున్నాయి. ధనుర్మాసంలో వచ్చే ముక్కోటి ఏకాదశి రోజున వైష్ణవాలయాల్లో స్వామివారిని దర్శించేందుకు ముక్కోటి దేవతలు దివి నుంచి భువికి దిగి వచ్చి భక్తులతో కలిసి శ్రీమన్నారాయణుడిని దర్శించుకుంటారనే నానుడి ఉండడంతో ఉత్తరద్వారాలు తెరుస్తారు. ఆలయాల్లో శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల నుంచి ఉత్తర ద్వారాలను తెరవనున్నారు. ఏడాదిలో ఒకరోజు మాత్రమే తెరుచుకునే ఉత్తర ద్వార దర్శనానికి భక్తులు అధిక ప్రాధాన్యం ఇస్తారు.

ఆలయాలు ముస్తాబు

ముక్కోటి ఏకాదశి పూజలకు తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లోని ఆలయాలు సిద్ధమయ్యాయి. ఎస్.అన్నవరంలోని శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి, తునిలో స్వయంభూ వెలసిన వేంకటేశ్వరస్వామి, ఎన్.సూరవరంలో వేంకటేశ్వరస్వామి, తొండంగి మండలం ఏవీ నగరంలో కల్యాణ వేంకటేశ్వరస్వామి, దానవాయపేటలో వేంకటేశ్వరస్వామి, జగ్గంపేట నియోజకవర్గం గోకవరం మండలంలోని తంటికొండ వేంకటేశ్వరస్వామి దేవస్థానాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ఉత్తర ద్వార దర్శనాలకు ప్రత్యేక ఏర్పాటు చేశారు. అన్నవరంలోని వీరవెంకట సత్యనారాయణస్వామి దేవస్థానంలో భారీ ఏర్పాట్లు చేయగా శుక్రవారం రాత్రికే పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అలాగే ప్రత్తిపాడు నియోజకవర్గంలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానాల్లో ఉత్తర ద్వార దర్శనాలకు భారీ ఏర్పాట్లు చేశారు.

తంటికొండ వెంకన్న ఆలయంలో ముక్కోటి ఏకాదశికి ఏర్పాట్లు

గోకవరం: మండలంలోని తంటికొండ గ్రామంలో ప్రసిద్ధిగాంచిన వెంకటగిరి కొండపై వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. శనివారం తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించనున్నారు. ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉన్నందున భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేసినట్టు దేవస్థానం ఈఓ బద్దిరెడ్డి రాంబాబు(రెడ్డి) తెలిపారు. అలాగే గుమ్మళ్లదొడ్డిలో శ్రీరామగిరి కొండపై వేంచేసిన సత్యనారాయణస్వామి ఆలయంలో ఉత్తరద్వార దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఏకాదశికి ఏర్పాట్లు పూర్తి

గండేపల్లి: తాళ్లూరు జీయ్యన్న మఠంలో వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ముక్కోటి ఏకాదశికి ఏర్పాట్లు పూర్తి ఏసినట్టు ఆలయ ఈఓ ఉండమట్ల రాజేష్ తెలిపారు. శనివారం తెల్లవారు జాము నుంచే భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తామన్నారు. అనంతరం స్వామి వారిని గ్రామంలో ఊరేగింపు నిర్వహిస్తామని చెప్పారు.

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం



రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. సత్యదేవుని ప్రధానాలయంలోని అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి, రత్నగిరి మెట్లదారిలో తొలిపావంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారికి ఘనంగా లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు. పండితులు ఉదయం 9 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమ గుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. మొత్తం 25 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

అమ్మవార్లకు లక్ష కుంకుమార్చన

సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ఆలయ ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలోనూ, కనకదుర్గ అమ్మవారికి ఆలయ అర్చకుడు కంచిబట్ల సాయిరామ్ ఆధ్వర్యంలోనూ రుత్విక్కులు లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు.

సంక్షేమ పాలన సీఎం జగన్‌తోనే సాధ్యం



పి.ఇ.చిన్నాయపాలెంలో పార్టీ జెండాను ఆవిష్కరించిన జెడ్పీ వైస్ చైర్మన్ పద్మలత



పెదశంకర్లపూడిలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు



లింగంపర్తిలో డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తొండంగి: సంక్షేమ పాలన సీఎం జగన్‌తోనే సాధ్యమని జెడ్పీ వైస్ చైర్మన్ మేరుగు పద్మలత అన్నారు. మండలంలోని పి.ఇ.చిన్నాయపాలెంలో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సచివాలయం వద్ద సంక్షేమ పథకాల వివరాలను తెలిపే డిజిటల్ బోర్డును ప్రారంభించారు. గ్రామంలో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్‌రాష్ట్ర కార్యదర్శి కొయ్యా మురళి, జిల్లా ప్రధాన కార్యదర్శి, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, జిల్లా ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు గాబు రాజు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ధూళిపూడి ఆంజనేయులు, పార్టీ కన్వీనర్ బద్ది నూకరాజు పాల్గొన్నారు.

ఏలేశ్వరం: రాష్ట్రంలో పేదలందరికీ న్యాయం జరగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అడపా పార్థసారథి అన్నారు. మండలంలోని లింగంపర్తిలో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. సచివాలయం-3 వద్ద ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల వివరాలను తెలిపే డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. ప్రధాన రహదారిలో పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరించారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్నివర్గాలకూ న్యాయం జరుగుతోందన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగాలంటే జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రి చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చిక్కాల లక్ష్మణరావు, యార్లగడ్డ రాజాచౌదరి, అలమండ నాగు, గుండుబిల్లి చక్రం, పాపారావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్ల పాల్గొన్నారు.

రౌతులపూడి: పేదల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జిగిరెడ్డి శ్రీను అన్నారు. మండలంలోని గిడజాంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే? కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సచివాలయం వద్ద డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. అనంతరం ప్రధాన రహదారిలో పార్టీ జెండాను ఎగురవేశారు. గ్రామంలో పర్యటించి ప్రజలకు సంక్షేమ పథకాలు వివరించారు.

జగనన్నను మళ్లీ గెలిపిద్దాం

ప్రత్తిపాడు: ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పంచాది వీరబాబు పిలుపు నిచ్చారు. ప్రత్తిపాడు మండలం పెదశంఖర్లపూడిలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే... కార్యక్రమం నిర్వహించారు. సచివాలయంలో సంక్షేమ పథకాల వివరాలను తెలిపే డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. గ్రామ మెయిన్ సెంటర్‌లో పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరించారు. కార్యక్రమంలో అన్నవరం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు దాశే చిట్టిబాబు, జేసీఎస్ మండల కన్వీనర్ రామిశెట్టి చినబాబు, మాజీ సర్పంచ్ దాశే నల్లబాబు (తమ్మారావు), మాజీ ఎంపీటీసీ కోట పద్దరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు దిమ్మల వీరులు, గోగాడ చిన్నయ్య, కొశెట్టి ధర్మరాజు, రాసంశెట్టి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు మోడల్ పరీక్ష పేపర్ల పంపిణీ

జగ్గంపేట: నిష్ణాతులైన ఉపాధ్యాయులు తయారు చేసిన పదో తరగతి మోడల్ పరీక్ష పేపర్లను శుక్రవారం విద్యార్థులకు పంపిణీ చేశారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పీపీపీ సత్యనారాయణ ఆధ్వర్యంలో రూ.50 వేల విలువ చేసే టెస్టు పేపర్లును మండలంలోని కాట్రావులపల్లి, రాజపూడి, మల్లిసాల, జగ్గంపేట జెడ్పీ హైస్కూళ్లలో విద్యార్థులకు అందజేశారు. గత సంవత్సరం ఇదేవిధంగా పంపిణీ చేసిన టెస్టు పేపర్స్ నుంచి 75 శాతం ప్రశ్నలు రావడంతో విద్యార్థులు మంచి మార్కులు సాధించారని యూటీఎఫ్ నేతలు తెలిపారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



కృష్ణవరంలో క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న పాస్టర్లు

కిర్లంపూడి: మండలంలోని కృష్ణవరం టోల్‌ప్లాజా వద్ద శుక్రవారం రోడ్డు సేఫ్టీ మేనేజర్ చైతన్య ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ప్లాజా సిబ్బందితో కలిసి కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. కార్యక్రమంలో సిబ్బంది అమర్‌నాథ్, విజయ్, గొల్లపల్లి సత్యనారాయణ, సునీల్, వీరబ్బాయి, శివబాబు పాల్గొన్నారు.

కృష్ణునిపాలెంలో...

గోకవరం: మండలంలోని కృష్ణునిపాలెం ఈహెచ్‌హెచ్ చర్చి ఆవరణలో శుక్రవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఎఫ్‌ఈఎం నేషనల్ డైరెక్టర్ రైమో జుహానీ హాలోనెన్, సుహాసిని హాలోనెన్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. పలువురు దైవజనులు క్రీస్తు సందేశాన్ని అందజేశారు. చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

శంఖవరం: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా పలు గ్రామాల్లో శని, ఆదివారాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో జగ్గంపేట ఈఈ రత్నాలరావు శుక్రవారం తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని శంఖవరం, జి.కొత్తపల్లి, గౌరంపేట, పి.మల్లాపురం గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

న్యాయవాదుల ఆందోళన

ప్రత్తిపాడు: ఆంధ్రా టైటిలింగ్ యాక్ట్ 27/2023 రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ న్యాయవాదులు శుక్రవారం ప్రత్తిపాడు జాతీయ రహదారిపై ఆందోళన చేశారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు నుంచి అల్లూరి సీతారామరాజు జంక్షన్ మీదుగా అటవీశాఖ చెక్‌పోస్టు వద్ద జాతీయ రహదారిని దిగ్బంధించారు. ప్రత్తిపాడు సీఐ ఎం.శేఖర్‌బాబు, ఎస్సై ఎం.పవన్‌కుమార్ తమ సిబ్బందితో హైవేకు చేరుకోవడంతో న్యాయవాదులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ పుల్లయ్య, సీనియర్ న్యాయవాదులు బుగత శివ, ప్రతినిధులు బొంగులూరి మధుబాబు, రాయి అత్యుత రామారావు, గెద్దం కామేశ్వరరావు పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో పనిదినాలు కల్పించాలి



శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీపీ దొరబాబు

గండేపల్లి: గ్రామాల్లోని ఉపాధి హామీ కూలీలకు పూర్తిస్థాయిలో పనిదినాలు కల్పించాలని ఎంపీపీ చలగళ్ల దొరబాబు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మహిళా మేట్లకు కొత్త పనులు, హాజరు శాతం, మస్టర్ల నిర్వహణ తదితర అంశాలపై శిక్షణ తరగతులకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి హామీ పనులను పారదర్శకంగా చేపట్టాలన్నారు. మేట్లకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామన్, ఏపీఓ గంగాభవాని, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహార కిట్ల పంపిణీ



గోకవరంలో టీబీ రోగులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

గోకవరం: మండలంలోని క్షయ (టీబీ) వ్యాధిగ్రస్తులకు పవర్‌గ్రిడ్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా సుమారు 100 మందికి వీటిని అందించారు. గోకవరం మండలంలోని టీబీ వ్యాధిగ్రస్తులకు ఆరు నెలల పాటు వీటిని అందించనున్నట్టు వైద్య సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ నిఖిత, ఎస్‌టీఎస్ వి.శ్రీనివాస్, వైద్య సిబ్బంది పవన్, రమణ, మట్టా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా స్వామివారి పల్లకీ సేవ



ఎస్.అన్నవరంలో స్వామివారికి పల్లకీ సేవ నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి పల్లకీ సేవ, ఊరేగింపు శుక్రవారం వైభవంగా జరిగాయి. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా సుప్రభాతసేవ, ఆరాధన, హోమం, పల్లకీ సేవ, ఉత్సవ మూర్తుల ఊరేగింపు, తీర్థ గోష్ఠి, ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. గోదాదేవి అమ్మవారికి విశేషాలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం ఉదయం ఐదు గంటల నుంచి భక్తులకు ఉత్తర ద్వార దర్శనాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు ఆలయ ధర్మకర్తలు తెలిపారు. దాడిశెట్టి విష్ణుచక్రం, కంకిపాటి జమీలు, పోతుల మురళి, భక్తులు పాల్గొన్నారు.

స్ఫూర్తిప్రదాత శ్రీనివాసరామానుజన్



ఏలేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ సునీత



బొద్దవరం హైస్కూల్‌లో రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



జగ్గంపేటలో రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఒమ్మి రఘురాం

- ఘనంగా జాతీయ గణితశాస్త్ర దినోత్సవం
- విద్యార్థులకు పలు అంశాలపై పోటీలు

కోటనందూరు: మండలంలోని బొద్దవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం గణితశాస్త్ర పితామహుడు శ్రీనివాసరాజమానుజన్ జయంతి (మేథమెటిక్స్ డే) వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు రాజానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు మేథమెటిక్స్ డే ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులకు గణితశాస్త్రంలో క్విజ్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సీహెచ్ వెంకటరమణ, గణిత ఉపాధ్యాయులు కేఎస్‌వీఎస్ నారాయణ, నాయుడు, సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఏలేశ్వరం: గణిత శాస్త్రవేత్త శ్రీనివాసరామానుజన్ జయంతిని పురస్కరించుకుని పట్టణంలో శుక్రవారం జాతీయ గణితశాస్త్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డి.సునీత ఆధ్వర్యంలో రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు సుడోకో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. రామానుజన్ గణితంలో చేసిన ప్రయోగాలను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రామారావు, మదీనా, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట: గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని శుక్రవారం జగ్గంపేటలో ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి, వివేకనంద విద్యాసంస్థల అధినేత ఒమ్మి రఘురాం ఆధ్వర్యంలో రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు గణితంలో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.



ప్రత్తిపాడులో శ్రీనివాస రామానుజన్ నంబర్ 1729 ఆకృతిలో ఏర్పడిన విద్యార్థులు

ప్రత్తిపాడు: గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతిని మండలంలోని పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. స్థానిక మినర్వా పాఠశాలలో అకడమిక్ డైరెక్టర్ ఆర్వీ చౌదరి రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులు శ్రీనివాస రామానుజన్ నంబర్ 1729 ఆకారంలో ఏర్పడి ఆకట్టుకున్నారు.

విస్తృతంగా ఎస్‌ఈబీ దాడులు

ప్రత్తిపాడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్-ఎస్‌ఈబీ) పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం విస్తృతంగా దాడులు చేసినట్టు సెబ్ సీఐ పి.అశోక్ తెలిపారు. ఏలేశ్వరం మండలం సిరిపురంలో రెండు లీటర్ల సారాతో సొంటెపు దుర్గమ్మను అదుపులోకి తీసుకున్నామన్నారు. ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెంలో సారా స్థావరంపై దాడి చేసి, సారా తయారీకి సిద్ధం చేసిన 100 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. సంఘటన స్థలం నుంచి మూడు లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, పెద్దిపాలెం గ్రామానికి చెందిన రీసు వీరబాబుపై పరారీ కేసు నమోదు చేశామన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తుని: మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సంఘ అధ్యక్షుడు కె.నాగభూషణం డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, ఇంజినీరింగ్ కార్మికులకు రిస్క్, హెల్త్ అలవెన్స్ చెల్లించాలని, పట్టణం విస్తరణ మేరకు సిబ్బందిని పెంచాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెకు దిగుతామని హెచ్చరించారు.

మండలాభివృద్ధే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాసు

కోటనందూరు: మండలాభివృద్ధే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎంపీపీ లగుడు శ్రీనివాసు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ శ్రీనివాసు అధ్యక్షతన మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ శ్రీనివాసు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజాసమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కరోనా మరోసారి విజృంభిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ నెల 26 నుంచి నిర్వహించే ఆడుదాం ఆంధ్రా, వికసిత్ భారత్ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. మిచాంగ్ తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు తడిసిన, రంగుమారిన ధాన్యాన్ని ఆంక్షలు లేకుండా రైసుమిల్లర్లు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని పలువురు ప్రజాప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. సొసైటీ అధ్యక్షుడు గొర్లి రామచంద్రరావు, ఏఏబీ మండలాధ్యక్షుడు సుర్ల రాజు, కో ఆప్షన్ సభ్యుడు జిగటాల కోటసత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నేతల సమావేశం

గోకవరం: గోకవరంలో శుక్రవారం బీజేపీ జగ్గంపేట నియోజకవర్గ శక్తి కేంద్ర ఇంచార్జిలతో సమావేశం నిర్వహించారు. ఆ పార్టీ మండలాధ్యక్షుడు సత్తి వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన సదస్సులో జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టా మంగరాజు, నియోజకవర్గ కన్వీనర్ దాట్ల కృష్ణవర్మ పాల్గొని పలు అంశాలపై చర్చించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం జనరంజక పాలన అందిస్తోందన్నారు. మండల ఉపాధ్యక్షుడు బత్తుల వెంకన్నబాబు, నాయకులు కోన సురేష్, పిల్లా సత్యనారాయణ పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



తొండంగి జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేసిన ప్రజాప్రతినిధులు

తొండంగి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు-నేడు పథకంతో కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశారని జెడ్పీ వైస్ చైర్మన్ మేరుగు పద్మలత, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు అన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్లో 8వ తరగతి విద్యార్థులకు శుక్రవారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. సుమారు 290 మంది విద్యార్థులకు పద్మలత, గంగబాబు ట్యాబ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను నాడు-నేడు పథకంలో అభివృద్ధి చేయడంతో పాటు ఇంగ్లిష్ మీడియం, డిజిటల్ తరగతులను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ప్రభుత్వ పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కొయ్యా మురళి, పార్టీ జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు గాబు రాజు, పార్టీ నాయకులు దడాల విజయ్, మండల సమన్వయ కమిటీ సభ్యుడు బెక్కం చంద్రగిరి, ఎంఈవో షేక్‌బాబ్జి, ఎంపీటీసీలు శివకోటి ప్రకాష్, అడపా సూర్యచక్రం, సర్పంచ్ ధారా అప్పన్న తదితరులు పాల్గొన్నారు.